# ఓటుహక్కును వినియోగించుకోవాలి

- వనపర్తి అదనపు కలెక్టర్ నగేశ్
- 6న 5కే రన్ నిర్వహణపై అధికారులతో సమీక్ష

వనపర్తి, ఏప్రిల్ 4: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వనపర్తి అదనపు కలెక్టర్ నగేశ్ పేర్కొన్నారు. స్వీప్ యాక్టివిటీలో భాగంగా శనివారం పట్టణంలో నిర్వహించే 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు లైన్ డిపార్టమెంట్ అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో స్వీప్ నోడల్ అధికారులు, యువజన సర్వీసులు, విద్యాశాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం, బాధ్యతాయుతంగా ఓటు వేయడంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ స్వీప్ యాక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. ఎక్కడైతే ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందో అక్కడ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 6వ తేదీన పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి బస్‌డిపో మీదుగా బాలుర పాఠశాల, గోపాల్‌పేట్ రోడ్డు వరకు ఉదయం 6:30గంటలకు దాదాపు 800మంది ఓటర్లతో 5కే రన్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 5కే రన్‌లో పాల్గొనే వారి కోసం తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అల్పాహారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాణ్యమైన సౌండ్ సిస్టమ్, అంబులెన్స్, పోలీసు బందోబస్తు అవసరమైన మేరకు పీఈడీలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎస్పీ హాజరై ప్రారంభిస్తారని తెలిపారు.

### ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్యయుత ప్రభుత్వం రావాలంటే ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత మిషన్ కో ఆర్డినేటర్ భాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని అంకూర్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీలకు స్వీప్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటు హక్కు లేనివారు నమోదు చేసుకోవాలని, అలాగే 18ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కు నమోదు చేయించి ఓటు వేసే విధంగా చూడాలన్నారు. మన ఇంట్లో ఉన్న వృద్ధులు, దివ్యాంగులందరూ ఓటుహక్కును వినియోగించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటు వేసేటప్పుడు జాతి, మతం, కులం, వర్గం, భాషలాంటి వాటికి ప్రభావితం కాకుండా నిజాయితీతో మంచి వ్యక్తులకు ఓటు వేసి ఎన్నుకోవాలన్నారు. దానివల్ల దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. ఓటు హక్కుకు సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫోన్ చేయవచ్చన్నారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి రామమహేశ్వరరావు, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, డీఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, మహిళా సాధికారిక కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్, సిబ్బంది శ్రీవాణి, సలోమి, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అంకూర్‌లో కూలీలకు స్వీప్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## తాగునీటి విషయంలో జాగ్రత్తలు వహించాలి

- జిల్లాస్పెషల్ ఆఫీసర్, డీఆర్డీవో నర్సింగరావు

ధర్మవరంలో నీటిసరఫరా మార్గాలను పరిశీలిస్తున్న డీఆర్డీవో నర్సింగరావు

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 4 : తాగునీటి విషయంలో గ్రామస్తులు జాగ్రత్తలు వహించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ డీఆర్డీవో నర్సింగరావు సూచించారు. గురువారం ఏఈఈ వంశీసాగర్‌తో కలిసి మండల కేంద్రం, ధర్మవరం, వల్లూరు గ్రామాల్లో తాగునీరు, గ్రామాల్లో నీటి సరఫరా మార్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నీటి వనరులు తగ్గిపోతున్నాయని ,అదే విధంగా జూరాలలో సైతం నీరు తగ్గిపోవడంతో రానున్న రోజుల్లో నీటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజలు మంచినీటి బావులు, బోర్లు, మోటర్లు మంచిగా పని చేసేవిధంగా ఉంచుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఈ శివన్న, ఎంపీవో భాస్కర్, భరత్, హరి పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్

మండల అధికారులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్

మదనాపురం, ఏప్రిల్ 4: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులను నీటి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ సిబ్బందితో సమన్వయంగా ఉంటూ కొళాయి ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. తాగునీటిపై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నమ్మ, ఎంపీవో పుష్ప, పీహెచ్‌సీ వైద్యురాలు భవాని, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

ఆత్మకూరు, ఏప్రిల్ 4: నిత్యం పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా మండుతున్న పరిస్థితుల్లో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారికోసమే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా పట్టణానికి నీటి సరఫరా అందించే పలు మంచినీటి బోర్లను స్పెషల్ ఆఫీసర్ దేశ్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరాతీశారు. వార్డుపల వారీగా తాగునీటి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు నిర్ణయాలు తీసుకున్నారు.

## విద్యార్థులకు సమస్యలు తలెత్తొద్దు

విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

చిన్నంబావి, ఏప్రిల్ 4: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి సమస్య లు తలెత్తకుండా చూసుకోవాలని ఎస్‌వోకు సూచించారు. తాగునీటి సమస్య లేకుండా పాఠశాలను పర్యవేక్షిస్తూ ఉండాలని మిషన్ భగీరథ ఏఈకి తెలియజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, ఉపాధ్యాయురాలు మంజుల, మిషన్ భగీరథ ఏఈ తేజ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పాన్‌గల్, ఏప్రిల్ 4: గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, ఉపాధి సమస్యలను ఎప్పటికప్పుడు తాత్సారం లేకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పేర్కొన్నారు. మండలకేంద్రంతోపాటు కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి తండా, ఆకులోనిపల్లి తండా, దావుత్యానాయక్‌పల్లిని అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. బోర్లు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మూతపడిన బోర్ల విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అన్నిచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో ఉపాధి హామీ పనుల్లో కూలీలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో నీడను ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్, ఏపీవో కుర్మయ్య, హెచ్‌ఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తెల్లరాళ్లపల్లి తండాలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## ఇష్టంగా చదవాలి

- ఏఎస్పీ రామదాస్ తేజావత్

మదనాపురం, ఏప్రిల్ 4 : విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలిగి ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఏఎస్పీ రామదాస్ తేజావత్ అన్నారు. మండలంలోని దుప్పల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో 72వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎస్పీ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, ఎస్సై శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### స్కావేంజర్ల జీతాలు ఖాతాలో జమ

అయిజ, ఏప్రిల్ 4 : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలను వారి బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఎంఈవో నర్సింహులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఐదు ప్రాథమిక, ఉర్దూ మీడియం, రెండు ఉన్నత పాఠశాలలతోపాటు పర్దిపురం, తుపత్రాల పాఠశాలల్లో 11 మంది స్కావేంజర్లు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతేడాది జూలై నుంచి డిసెంబర్ 6 నెలల జీతాలు వారి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు.

### విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

మదనాపురం, ఏప్రిల్ 4: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 4నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింహులు గురువారం ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలందరూ సహకరించాలన్నారు.

### వరి పంటల పరిశీలన

గట్టు, ఏప్రిల్ 4: మండలంలోని ఆరగిద్ద శివారు సాగు చేసిన పంటలను ఏఈవో తిరుమలేశ్ గురువారం పరిశీలించారు. నీరు లేక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో ఉన్న తాహికారుల ఆదేశాల మేరకు పంటలను పరిశీలిస్తున్నారు. ఆరగిద్ద శివారులో ఎటువంటి పంటలు ఎండలేదని రైతులు తెలియజేశారని ఏఈవో తెలిపారు.

### గద్వాల మండలంలో..

గద్వాల రూరల్, ఏప్రిల్ 4 : మండలంలోని కుర్వపల్లి గ్రామంలో గురువారం ఏవో ప్రతాప్ కుమార్ వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట గింజ పట్టేదశలో ఉందని, ఇంకా వారం పది రోజుల్లో పంట చేతికి వస్తుందన్నారు. రైతులు పంటలకు తడులను వేసుకోవాలన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధం

గద్వాల అర్బన్, ఏప్రిల్ 4 : షార్ట్ సర్క్యూట్‌తో వస్తువులు దగ్ధమైన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు... జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో నివాసం ఉంటున్న శంకరయ్య ఇంట్లో గురువారం విద్యుత్ వైర్ల నుంచి మంటలు చెలరేగి వస్తువు లన్నీ కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తినష్టం అయినట్లు పేర్కొన్నారు.

### ర్యాలీని విజయవంతం చేయాలి

గట్టు, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రంలో ఈనెల 12వ తేదీన నిర్వహించే అంబేద్కర్ ఆలోచన పండుగ ర్యాలీ, సభను విజయవంతం చేయాలని వక్తలు కోరారు. మండలంలోని గొర్ల ఖాన్‌దొడ్డిలో ర్యాలీ, సభకు సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కేఏస్ ఈవెంట్ హాల్‌లో నిర్వహించే పండుగ ర్యాలీ, సభకు ప్రొఫెసర్ కాశీం హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొజ్జన్న, మాజీ సర్పంచ్ సిద్ధప్ప, నాయకులు వసంత్, వీరారెడ్డి, బోయ వీరేశ్, ఆంజనేయులు, తిమ్మప్ప పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి

- జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, ఏప్రిల్ 4: జిల్లాలో తాగునీటి సరఫరాను ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. గురువారం తాగునీటి సమస్యపై కలెక్టరేట్‌లో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు అధికారులు తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సజావుగా తాగునీటి సరఫరా చేసేందుకు ఏమైనా లీకేజీలు, మరమ్మతులు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు తాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాలతో నీటిని సరఫరా చేయాలని, ట్యాంకుల నుంచి నల్లాలకు నీటిని సరఫరా చేసే క్రమంలో ఎక్కడ పైప్‌లైన్ లీకేజీ కాకుండా, వాల్వులు వద్ద సమస్యలు తలెత్తకుండా తరచుగా అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ వేసవిలో ఎక్కడ నీరు వృథా కాకుండా ప్రజలకు అధికారులు తెలియజేయాలన్నారు. ఈ విషయంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని పరిష్కరించేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బొందపెడుతాం

- మాదిగ జేఏసీ నాయకులు

కొత్తకోట, ఏప్రిల్ 4: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బొంద పెడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కొమ్ము చెన్నకేశవులు, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌మాదిగ అన్నారు. పట్టణంలోని చౌరస్తాలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీరును ఎండగడుతూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి, మల్లికార్జున్ ఖర్గే మాదిగజాతి ద్రోహులన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులను తెలంగాణలో అడుగడునా అడ్డుకోవాలని వారు పిలుపునిచ్చారు. మాలలతో కుమ్మక్కై మాదిగలను రాజకీయంగా అణిచివేయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ సీట్లల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. 12పార్లమెంట్ స్థానాల్లో 5శాతం లేని రెడ్లకు 6సీట్లు కేటాయించి 12శాతంపైగా ఉన్న మాదిగలకు ఒక్కస్థానం కూడా కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలు, బీసీలకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. కాంగ్రెసిది ప్రజాప్రభుత్వం కాదని, రెడ్లు, మాలల ప్రభుత్వమేనన్నారు. రేవంత్‌రెడ్డి మాలలకు భయపడి ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసమే మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భరత్‌భూషన్, మొగులన్న, పద్మనెహ్రూ, వికాస్, మహేశ్, ఎల్లప్ప, వినోద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 4 : రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవా లని ఏఈవో మౌనిక అన్నారు. ఐకేపీ సెంటర్ సభ్యులు, ఏఈవోతో కలిసి తిమ్మాపూర్‌లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏఈవో మాట్లాడుతూ వరి తేమ శాతం 17కంటే తక్కువ ఉండాలని, ప్రతి రోజూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఏగ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి క్వింటాకు రూ.2,183లకు కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొనుగోలు ఇన్‌చార్జి రవీంద్రమ్మ, వీవోఏ వేణుగోపాల్, రాముడు, భీసన్న, శ్రీను, ఈశ్వర్, శివనాయుడు, కళావతమ్మ, రైతులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గోపాల్‌పేట, ఏప్రిల్ 4: మండలంలోని బుద్దారం, లక్ష్మీతండా, పాటిగడ్డ తండా, గోపాల్‌పేట, చాకల్‌పల్లి, చెన్నూరు, పొల్కెపహాడ్, జయన్నతిరుమలాపురం గ్రామాల్లో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు ప్రారంభించారు. పొల్కెపహాడ్‌లో డీఆర్డీఏ, డీపీఎం ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి జానకి, బుద్దారంలో డీపీఎం బాషా, సీసీ శ్రీనివాసులు, ఏపీఎం చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి రమేశ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

# ఆదిశిలా క్షేత్రాన్ని దర్శించుకున్న పీఠాధిపతి

మల్దకల్, ఏప్రిల్ 4: ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం ఉడిపీలోని పలిమారు మఠం పీఠాధిపతి విద్యాదీశ తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు, బ్రాహ్మణులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామీజీకి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వేద పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో అరవిందరావు, మధ్వాచారి, రమేశాచారి, రవిచారి, బాబురావు, ప్రసన్నాచారి, నాగరాజుశర్మ, వెంకోబరావు, శ్రీధర్, పవన్‌రావు, చంద్రశేఖర్‌రావు, నరేందర్, చంద్రశేఖర్‌రెడ్డి, మధు, శ్రీనివాసులుశెట్టి, రాజు, రామాచారి పాల్గొన్నారు.

స్వామీజీని శేషవస్త్రంతో సత్కరిస్తున్న చైర్మన్

## ఆర్టీసీ లాజిస్టిక్స్‌లో భద్రాద్రి తలంబ్రాలు

వనపనర్తి టౌన్, ఏప్రిల్ 4: వనపర్తి డిపో లాజిస్టిక్స్ ద్వారా భద్రాచలం నుంచి భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు టీఎస్ఆర్టీసీ శ్రీకారం చుట్టినట్లు డీఎం వేణుగోపాల్ తెలిపారు. కల్యాణానికి వెళ్లలేని భక్తులు తలంబ్రాలను అందుకునేందుకు వనపర్తి డిపో పరిధిలోని లాజిస్టిక్స్ కౌంటర్లలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తలంబ్రాలు కావాలనుకున్న భక్తులు రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేయించుకొని రసీదు పొందితే రాములోరి కల్యాణ తలంబ్రాలను అందించనున్నట్లు చెప్పారు. ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు బుక్ చేసుకునే అకాశం ఉందని తెలిపారు. భక్తులు వనపర్తి డిపో పరిధిలోని బస్ స్టేషన్ల లా జిస్టిక్స్ కౌంటర్లలో సంప్రదించాలని సూచించారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 9154298616, వనపర్తి లాజిస్టిక్స్ 7396601068, 8019894018, పెబ్బేర్ 880182 8143, కొత్తకోట 9705812281, ఆత్మకూరు 73828 29494 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకో వాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## 8నుంచి ఎస్‌ఏ పరీక్షలు

వనపనర్తి టౌన్, ఏప్రిల్ 4: ఈనెల 8 నుంచి 1నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న పాఠశాలల విద్యార్థులకు సమ్మెటివ్ పరీక్ష ఉంటుందని జిల్లా పరీక్షల విభాగాధిపతి గణేశ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏప్రిల్ 8 నుంచి 19 వరకు పరీక్షలు ఉంటాయని, ఏప్రిల్ 8, 9, 13, 15 తేదీల్లో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:30నుంచి 12గంటల వరకు, 6-8వ తరగతి విద్యార్థులకు 8, 10, 13, 15, 16, 18 తేదీల్లో పరీక్షలు ఉంటాయని, 9వ తరగతి విద్యార్థులకు మాత్రం ఏప్రిల్ 19 వరకు కొనసాగుతాయని చెప్పారు. మూల్యాంకనం చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 4 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుబడిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు గురువారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో బీచుపల్లి నుంచి కొండేరు గ్రామానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో డ్రైవర్ వీరన్న పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొత్తకోట, ఏప్రిల్ 4: మండలంలోని రాయినిపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన 41క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన సక్కకుమార్ అతని అన్న ఇంట్లో 41 క్వింటాళ్ల బియ్యాన్ని నిల్వ ఉంచాడు. గ్రామస్తులతో కిలోకు రూ.పది చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసి అనంతరం రూ.18 చొప్పున కర్ణాటక రాష్ట్రానికి అమ్ముతున్నట్లు విచారణలో తెలింది. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్సై బాలవెంకటరమణ

అయిజ రూరల్ , ఏప్రిల్ 4 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మహబూబ్‌నగర్ ఎస్సై బాల వెంకటరమణ పేర్కొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామంలో రెండో రోజు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో దేహదారుడ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు .క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మహేశ్ నాయుడు,మోటివేసినల్ స్వీకర్ రవీందర్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పట్టణ సమస్యలను పరిష్కరించాలి

తాసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అలంపూర్, ఏప్రిల్ 4 : అలంపూర్ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తాసీల్దార్ కార్యాలయం, మున్సిపాలిటీ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భం గా జిల్లా నాయకులు రాజు, మండల కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ అలంపూర్ పట్టణంలోని ఆయా వార్డుల్లో అంతర్గత సీసీ రోడ్లు పూర్తిస్థాయిలో వేయలేదని, వీధిలైట్లు చాలా చోట్ల వ